# "తిరస్కృతి"

రచన :
శ్రీమతి ఎస్. స్నేహలత

"రాధా! రాధా!" అపుడే బయట నుండి వస్తూ పిలిచారు ప్రసాదరావుగారు.

"ఏమిటి నాన్నా? ఎందుకు పిలిచారు?" అంటూ రాధ వచ్చింది.

"ఇదిగో మీ బావ ఉత్తరం వ్రాసాడు. రేపు మెయిల్‌కి వస్తున్నాడట. నిన్ను పెళ్ళిచేసుకోడానికి అంగీకారమే నట. ఇదివరకు నిన్ను కాలదన్నినందుకు క్షమించాలట. ఎంత ప్రయత్నించినా తనకి తగిన వధువు దొరకలేదట. ఏదో ఒక లోపం ఉంటూ ఉందట. ఏదో ఏదో వ్రాశాడు. చదువు ఈ ఉత్తరం" అంటూ ఉత్తరం రాధ చేతి కందించి వెళ్ళిపోయారు ప్రసాదరావుగారు.

రాధ ఉత్తరం చదువుకొంది. నెత్తిమీద పిడుగు పడి నట్టయింది. అసలు తన బావ మనసు ఎందుకిలా మారింది? రెండు సంవత్సరముల క్రితం, తనూ, తండ్రి వివాహ విషయం అడిగినపుడు ససేమిరా వద్దు అన్న బావ ఎందుకిలా తన ఉద్దేశ్యం మార్చుకోవలసి వచ్చింది? కేవలం తనకి నచ్చిన పిల్ల దొరకకపోవడమే కారణం అవుతుందంటే రాధకెందుకో నమ్మకంలేదు. ప్రస్తుతం తన బావంటే రాధకి మామూలు అభిమానం తప్ప, భర్తగా స్వీకరించేటంత యిష్టంలేదు. దానికి కారణం ఈ రెండు సంవత్సరాలలో జరిగిన మార్పులే!

రెండు సంవత్సరాల క్రితం మురళి రాధని తిరస్కరించటం, తిరస్కరించడమే కాకుండా చాలా కటువుగా మాట్లాడటం జరిగింది.

రాధ మేనమామ కొడుకు మురళి. చిన్నప్పటి నుండి యిద్దరూ చాలా చనువుగా ఉంటుండేవారు. మురళి తల్లి దండ్రులకు ఒక్కడే కుమారుడు. ధనవంతులవడం వల్ల ఏది కావాలంటే అది యిస్తూ గారాబంగా పెంచారు. మురళికి చిన్నప్పటినుండి అహంభావం. అహంకారం జాస్తి. తానే గొప్ప వాడనీ. ఎదుట వారిని హీనంగా చూడడం అతనికి అలవాటు.

రాధ తల్లి, రాధ పదేళ్ళ వయస్సులో ఉన్నపుడు మరణించింది. తండ్రి ప్రసాదరావుగారు. సామాన్య కుటుంబీకుడు. చెప్పుకోదగ్గ ధనవంతులుకాదు. చదువు సంస్కారం కల మనిషి. రాజా, రాధ ఆయన సంతానం. రాజు రాధకి అన్నయ్య. రాజు కాకినాడలో బి. ఇ. ఫస్టు యియర్ చదువు తున్నాడు.

రెండు సంవత్సరాల క్రితం రాధ ఎస్. ఎస్. ఎల్. సి చదువుతుండేది. అదే సమయంలో మురళి వైజాగ్‌లో బి. ఎల్ చదువుతున్నాడు. వేసంగి సెలవుల్లో మురళి. మురళి తల్లి ప్రసాదరావు గారింటికి వచ్చారు. ప్రసాదరావు గారు రాధ, మురళిల వివాహ విషయం గురించి మాట్లాడ డానికి సమయం చూస్తున్నారు. ఒక రోజు ధైర్యం చేసి మురళి తల్లిని అడిగారు. మురళి తల్లికి రాధని కోడలిగా చేసుకోవడం ఎంత మాత్రం యిష్టంలేదు. తన కొడుక్కి తగిన కట్నం ప్రసాదరావుగారు యివ్వలేరు. అది తెలిసే తన అయిష్టాన్ని వెలిబుచ్చింది. వెలి బుచ్చడమేగాదు. రాధ తనకి తగిన కోడలు కాదనీ, తనకొక్కడే కొడుకనీ, ముద్దు, ముచ్చటా తీరాలనీ, గొప్పింటి అమ్మాయినే తను కోడలిగా స్వీకరిస్తుందనీ నిక్కచ్చిగా చెప్పింది. ఈ మాటలకి ప్రసాదరావుగారికి వళ్ళు మండింది. కాని శాంత స్వభావులు కనుక ఎలాగో ఆ కోపాన్నంతా అణచి పెట్టు కోగలిగారు.

మురళికి తల్లి ఎంత చెబితే అంత. తండ్రికన్నా తల్లి అంటేనే భయం, భక్తి. అందుకని రాజు తనని స్వయంగా అడిగినప్పుడు కూడా ఎంతో గర్వం చూపాడు. పైగా రాధని "అందని పండుకు ఆశించడం అవివేకం" అని ఎత్తిపొడిచాడు. రాధ అభిమానం దెబ్బ తింది. ఏడుపు కూడా ఆగకుండా వచ్చింది.

"అవును బావా! అందని పండుకు ఆశించడం నాతప్పే! నాకు బుద్ధి వచ్చిందిలే! యిక ముందు కూడా అందరాని ఆశలకి పోకుండా ఉండడానికి ప్రయత్నిస్తాను" అంది కన్నీరు కారుస్తూ. అంతే! దానితో మురళిని పెళ్ళి చేసుకోవాలనే తలంపుకి స్వస్తి చెప్పింది. తనకి మించిన వాటికి పోవటం తెలివి తక్కువే అనుకుంది. కాని మురళి అలా ముక్కు మొఖం చూడకుండా అంత నిష్కర్షగా చెప్పడమే తనకి బాధగా ఉండేది. రాధకి అభిమానం ఎక్కువ. ఒకర్ని అనడం అన్నా, ఒకరితో పడడమన్నా యిష్టం ఉండదు. అందుకే అభిమానం ముంచుకు వచ్చింది. కాని అటువంటి సమయంలో కూడా మురళిని ఏమీ దురుసుమాట అనలేదు. మురళి, వాళ్ళు కొన్నాళ్ళుండి వెళ్ళిపోయారు.

రాధకి అపుడప్పుడూ మురళి గుర్తుకొస్తుండే వాడు. అలా గుర్తు వచ్చినపుడల్లా అదోకలా బాధ పడేది. మురళి తనని తిరస్కరించినందుకు కాదు, మురళితో అంత మాట పడవలసి వచ్చినందుకు. తనూ, తండ్రి ముందు ఎందు కడగాలి? అలా అడక్కుండా ఉంటే అంతమాట అనడానికి అవకాశ ముండునా? కాని ఏం లాభం? నిజానికి అపుడు రాధకి పెళ్ళి వయస్సురానే లేదు. అయితేనేం? ఏ సంగతీ తేల్చుకోవాలనే కంగారు ప్రసాదరావుగారికి. అందుకే అలా మాట పడవలసి వచ్చింది. మురళి అన్నమాట తలుచుకొని అపుడప్పుడూ ఏడుస్తుండేది రాధ. కాని మురళి అంటే తనకి ఎపుడూ కోపంలేదు. క్రమక్రమంగా మురళిని తన హృదయం లోంచి తొలిగించేసింది.

కొన్ని రోజులు గడచాయి. రాధ ఎస్. ఎస్. ఎల్. సి ప్యాసయింది. ఇంకా చదువుకోవాలని కుతూహలంగానే ఉంది. యింటరులో జాయినయ్యింది. కాలేజిలో ఒకసారి 'రవి' అనే ఒక స్టూడెంటుని చూసింది. రాధకి ఎందుకో అతనిమీద ఎక్కడలేని అభిమానం పుట్టుకొచ్చింది. ఎపుడూ నవ్వుతుండే అతని ముఖం, దీనంగా చూసే ఆ కళ్ళు రాధ హృదయంలో నిలచిపోయినయ్. క్రమంగా అతన్నిగురించి తెలుసుకోగలిగింది. బి. ఎ. చదువుతున్నాడు. తను చదివే కాలేజీలోనే. కాని రాధకీ, రవికీ పరిచయంలేదు. అయితేనేం? రవిని గురించి రాధకి అంతా తెలుసు. రవి చాలా తెలివైనవాడు. మరు కైనవాడు. కొంచెం పేదకుటుంబంలో వాడవడంవల్ల చాలా నిరాడంబరంగా ఉంటాడు. రాధ, రవిని ఆరాధ్య [illegible] ఆగాదిస్తూంది. కాని రవికి యిదేం తెలియదు. తను మామూలుగా కాలేజికి వస్తూ పోతూం టాడు. రవిని చూసినకొద్దీ యింకా చూడాలనే ఉంటుంది రాధకి. ఏ ఒక్క రోజైనా రవికనిపించకపోతే ఏదోదిగులు పట్టుకునేది.

తను రవిని ఎందుకిలా ఆరాధించాలి? అహోచిత వ్యక్తిని ఎవరైనా ఆరాధించి, ప్రేమిస్తారా? ఇలా తనలో తనే ప్రశ్నించుకునేది రాధ. కాని వాటికి జవాబు శూన్యం.

మురళి తనని ఆనాడు తిరస్కరించకపోతే రవికి తన హృదయంలో స్థానం ఉండేదికాదు. యిపుడు రవి తన హృదయంలో శాశ్వతస్థానాన్ని ఆక్రమించుకున్నాడు. కాని రవికూడా తనకి హృదయం యివ్వగలడో లేదో! ఎలా తెలుస్తుంది తనకి? తండ్రికి చెబితే ఏమంటారో అనే భయం. అలాగే రవిని ఆరాధిస్తూ, పూజిస్తూ కాలం గడుపుతూంది. తన తండ్రి తన కోరిక నెపుడూ కాదనడు. కాని తనెలాచెబుతుంది? అదే సమస్యగాఉంది. రేపు మురళి మెయిల్‌కి వస్తాడు. పెళ్ళి విషయం అడుగుతాడు. తను ఎలాచెప్పాలి? ఆనాడు మురళి తనని తిరస్కరించాడు. రేపు మురళిని తను తిరస్కరించాలి. అంతే! వేరే గత్యంతరములేదు. కాని రాధకి ఎందుకో కంగారుగా ఉంది. తండ్రి అడిగితే ఏంచెప్పాలి? "మురళి అంటే యిష్టంలేదు" అంటే ఏమంటారో ఏమో! "ఎందుకిష్టలేదు?" అనడిగితే ఏంచెప్పాలి? ఈసందర్భంలో రవి విషయం తండ్రికి చెబితే బాగుండుననిపించింది. కాని రవి మనసు తెలుసుకోకుండా ఎలా చెబుతుంది? రవి ఉద్దేశ్యంమాత్రం తనకెలా తెలుస్తుంది? అడుగుదా మంటే పరిచయంకూడా లేదాయె. ఒక దైవ విగ్రహాన్ని ఆరాధించినట్టు రవిని ఆరాధించటమే కాని దానికి ప్రతి ఫలం ఏమీ ఉండదేమో అనిపించింది రాధకి.

రవి ప్రేమను తను పొందలేకపోయినా సరే మురళిని మాత్రం చచ్చినా పెళ్ళిచేసుకోగూడదు. ఆనాడు మురళి అన్నమాటలు జ్ఞాపకం వచ్చినపుడల్లా అభిమానం కట్టలు తెంచుకువస్తూంది. అంతమాట అనిపించుకుని అతన్నే పెళ్ళాడాలా? అదెప్పుడూ జరగదు. రేపు మురళి వస్తే నిక్కచ్చిగా చెప్పాలి "నువ్వంటే నాకిష్టంలేదు" అని. రాధ ఈ దృఢ నిశ్చయానికి వచ్చింది.

రేపు ప్రొద్దుటే మెయిల్‌కి మురళి వస్తాడు. మురళి రాకముందే తండ్రికి మురళి అంటే యిష్టంలేదని చెప్తే బాగుండుననుకుంది. సమయంకోసం నిరీక్షిస్తుంది రాధ.

రాత్రి ఎలాగో ధైర్యంచేసి భోజనాలదగ్గర చెప్పింది.

'ఏమమ్మా? బావంటే నీకిష్టమేగా! యిపుడిలా అంటా వేం?" అడిగారు ప్రసాదరావుగారు.

"అవును నాన్నా! బావంటే నాకు యిష్టమే. కాని పెళ్ళి చేసుకోవడం యిష్టంలేదు. ఇదివరకు బావ అంగీకరించి ఉంటే నాకూ సంతోషంగా ఉండేది. కాని నాకిపుడు బావంటే సోదరభావంతప్ప మరేంలేదు" ఎలాగో సిగ్గు నంతా దాచుకుని అనగలిగింది రాధ.

ప్రసాదరావుగారి కిదేం అర్థకాకుండావుంది. చిన్నప్పటి నుండి మురళి అంటే అమిత యిష్టం రాధకి. ఆ సంగతి ప్రసాదరావుగారికీ తెలుసు. అయితే రాధ ఎందుకిలా మురళిని వద్దు అంటూంది?

"అదికాదమ్మా? ఎందుకిష్టంలేదో చెప్పు. నీకిష్టం లేనపుడు బలవంతం చేసేటంతటి మూర్ఖుణ్ణికాను" ఈ మాటలు విని రాధ ఉక్కిరిబిక్కిరయింది. తండ్రికి ఏమని సమాధానంచెప్పాలి? ఈ సమయంలో రవి విషయం కూడా చెప్తే బాగుండుననుకుంది. కాని ఎందుకో మళ్ళీ వెనుకాడింది.

"ఏం అమ్మా! ఎందుకిష్టంలేదో చెప్పు!" మళ్ళీ అడిగారు ప్రసాదరావుగారు.

"యిష్టంలేకపోవడానికేమంత పెద్ద కారణంలేదునాన్నా! నాకు బావంటే యిదివరకటి భావంలేదు. నేను ప్రస్తుతం సోదరుడిగానే ప్రేమిస్తున్నాను"

"సరేలే! రేపు మురళి వస్తే నీకు యింష్టంలేదనే చెప్తాను. నీకు యిష్టం లేనపుడు ఎందుకీపెళ్ళి?" అన్నారు ప్రసాదరావుగారు. రాధ హృదయం కొంతవరకు తేలిక పడింది.

మర్నాడు మురళి వచ్చాడు. ప్రసాదురావుగారు చల్లగా చెప్పారు రాధకి యిష్టంలేదని. మురళికి నమ్మకం చాలలేదు. రాధకి తనంటే ఎంతో యిష్టమని అతని నమ్మకం. అందుకని రాధనే స్వయంగా అడగాలను కున్నాడు. సమయంచూసి రాధని అడిగాడుకూడా.

"అవును బావా! నిన్ను ప్రస్తుతం సోదరునిలాగ ప్రేమిస్తున్నాను. ఇదివరకటి భావం నాకు ఏనాడో తొలిగి పోయింది. అయినా అందరానివాటికి ఆశించకూడదని ఏనాడో గట్టి నిశ్చయం చేసుకున్నాను" అంది రాధ.

"నన్ను దెప్పుతున్నావుకదూ రాధా! పోనీలే! నీ కిష్టం లేకపోతే బలవంతం లేదుగాని, ఒక్కటి అడుగు తున్నాను చెప్పు. ఆనాడు నువ్వు, నిన్ను పెళ్ళాటమని స్వయంగా అడిగావాలేదా?"

"అడిగాను బావా! కాని అపుడు నాకింకా పూర్తిగా జ్ఞానం రాలేదేమో అనిపిస్తూంది. ప్రేమ, పెళ్ళి, సంసారం, జీవితం—ఇటువంటి మాటలు అర్థరహితంగా ఉండేవి నా కపుడు. మామూలుగా యిష్టం గనుక అడిగాను అంతే!"

"అంతేనా? అయితే నీ కపుడు నామీద నిజమైన ప్రేమ లేదన్నమాట!"

"లేదు. అసలు ప్రేమంటేనే నాకు తెలియదు అపుడు"

"ఇపుడు తెలుసుకున్నా వన్నమాట!" వ్యంగంగా అన్నాడు మురళి.

అవును. ఇపుడు తెలుసుకున్నాను బావా! ఆనాడు నువ్వు నన్ను భార్యగా స్వీకరించడానికి అంగీకరించి నట్టయితే నా హృదయంలో మరొకరికి స్థానం ఉండక పోను. కాని నువ్వు నన్ను తిరస్కరించావు తత్ఫలితంగా హృదయం వేరొకరికి స్థానం అయింది."

"అయితే నీ హృదయంలో స్థానం ఏర్పరచుకున్న ఆ వ్యక్తి ఎవరో చెప్పు. ఎంత గొప్పవాడో చూద్దాం" హేళనగా అన్నాడు మురళి. రాధమనస్సు చివుక్కుమంది.

"స్త్రీగాని, పురుషుడుగాని తాను హృదయపూర్వకంగా ప్రేమించినవ్యక్తిని గొప్పగానే భావిస్తారు బావా!"

"ఓహో! అలాగా! నాకు తెలియదులే!" మురళి మాటల్లో వెటకారం ఉట్టిపడింది. రాధ ఏమీ మాట్లాడలేదు.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగానే గడిచాయి. కొంత సేపటికి మురళి అన్నాడు "నువ్వంటే ఆ వ్యక్తికికూడా యిష్టమేనా?"

"ఏమో బావా! అదేం నాకుతెలియదు. అతనితో కనీసం పరిచయంకూడా లేదు. కాని అతన్ని గురించి నా కంతా తెలుసు"

"అయితే అతనే నీకు భర్తగా లభిస్తాడని నీకు నమ్మకం ఏమిటి?"

ఈ ప్రశ్న కేం సమాధానం చెప్పాలో రాధకి తోచ లేదు. మౌనంగా ఉండిపోయింది కొంతసేపటివరకు.

"రాధా! ఎందుకు లేనిపోని బాధ తెచ్చిపెట్టుకుం టావు? నా మాట విని ఆ వ్యక్తిని మరచిపోవడానికి ప్రయత్నించు"

"అది నావల్ల కానిపని బావా!"

"సరే! ఇంక నేనేం చెబుతాను? నేనిక వెళ్ళిపో వచ్చుగా! ఆనాడు నా తిరస్కృతి - ఈనాడు నీ తిరస్కృతి" మురళి కొంచెం బాధగానే అన్నాడు.

"బావా! నీమనసు నొప్పించినందుకు క్షమించు. నువ్వు అపుడే వెళ్ళిపోవద్దు. వారం రోజు లుంటానని చెప్పావుగా నిన్న"

"ఉందామనుకున్నాను కాని............ఇక ఉండ దలుచుకోలేదు" కచ్చితంగా చెప్పాడు మురళి.

"అంతేనా బావా! నువ్వు అపుడే వెళ్ళిపోయావంటే నాకు బాధగా ఉంటుంది. ఈ వారం రోజులూ ఉండి వెళ్ళుదువుగాని, వెళ్తూ, వెళ్తూ నన్ను ఏడిపిస్తావా బావా?" బ్రతిమాలుతూ అంది రాధ.

"ఏమైనాకానీ. నే నుండను అంటే ఉండను"

రాధ కీసారి ఏడుపాగలేదు. గబగబా గదిలోకివెళ్ళి పోయింది. మురళి వెళ్ళిపోతే తనకేం? ఎందుకిలా బాధ పడడం? ఏమిటి తనకీ దౌర్బల్యం? ఆలోచిస్తూంది రాధ గదిలో.

కొంతసేపటికి ప్రసాదరావుగారు వచ్చి బెడ్డింగు, బట్టలు సర్దుకుంటున్న మురళినిచూసి ఆశ్చర్యపోయారు.

"అదేమిటి మురళీ? అపుడే ప్రయాణం కడుతు న్నావు?" గాబరాగా అడిగారు.

"అవును మామయ్యా! కాకినాడలో ఒక ఫ్రెండు న్నాడు. అతన్ని కలుసుకుని అటు వైజాగ్ వెళ్ళిపోవాలి" తడుముకోవలసిన అవసరం లేకుండానే అనేశాడు.

"వెళ్తే తరువాత వెళ్ళగూడదూ! నాలుగురోజులుండి వెడుదువుగాని" అన్నారు ప్రసాదరావుగారు.

"అలాకాదు మామయ్యా! ఈసారి తప్పక వెళ్ళాలి. మళ్ళీ కొన్నాళ్ళకి వస్తానులే!" అన్నాడు మురళి.

"సరే! నీయిష్టం!" అన్నారు ప్రసాదరావుగారు.

ఇదంతా గదిలోంచి రాధ వింటూనేఉంది. మురళి తలుచుకున్నాడంటే ఇక ఎంతమంది ఆపినా ఆగడు. అది తనకి తెలుసు. ఇకముందు కూడా తమ యింటికి వస్తాడనే నమ్మకంలేదు తనకి. మురళికి ఎదుటివారిబాధ నర్థంచేసుకునే శక్తిలేదు. అటువంటి శక్తి ఉంటే యిలా ప్రవర్తిస్తాడా? తనంతటివాడిని నిరాకరించిందనే మురళికి అంత ఆగ్రహం. దానికి తనేంచేస్తుంది? ఒకవైపున అభిమానం, మరొకవైపున రవిమీద ఉన్న మమకారం- ఈ రెండూ తనని ఆవిధంగా మార్చాయి. ఏదో ఆలో చిస్తూంది రాధ గదిలో ఒంటరిగా.

ప్రక్కగదిలో మురళి ప్రయాణసన్నాహంలో ఉన్నాడు. ప్రసాదరావుగారు జట్కా తేవడానికి వెళ్ళేరు. కొంత సేపటికి జట్కా రానేవచ్చింది.

"రాధా! నే వెళుతున్నాను" గది గుమ్మం దగ్గర నుంచే చెప్పాడు మురళి.

"బావా! ఒక్కమాట!"

"ఏమిటి?" గదిలోకివస్తూ అడిగాడు.

"బావా నా మీద నీకు కోపంగా ఉంటేకదూ! నా బాధ నువ్వైనా అర్థం చేసుకోలేకపోతున్నావు." ఏడుస్తూ అంది రాధ.

"......................."

"పోనీ మళ్ళీ ఎపుడు వస్తావో చెప్పు"

"ఏమో! ఎపుడు వస్తానో నాకే తెలియదు. అసలు రానే రానేమో!" మొండిగా చెప్పాడు మురళి.

"అదికాదు బావా! నువ్వు తలుచుకుంటే రాగలవు. నా ప్రస్తుతపరిస్థితి నీకర్థం కాలేదా బావా? అంతా విప్పి చెప్పానుకూడా!"

"అర్థమయిందిలే! మరి నేవెళతాను. టైమవుతూంది"

"బావా! మళ్ళా వస్తానని మాట ఇయ్యి. నాకు కొంచెం శాంతిగా ఉంటుంది" ఏడుస్తూ అడిగింది రాధ.

"ఊహుఁ! మళ్ళీ రాదలుచుకోలేదు"

"అంతేనా బావా?"

"ఓ! అక్షరాలా అంతే!" ఈమాట అనేసి గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయాడు మురళిగదిలోనుండి.

కొంచెం సేపటికి జట్కాలో స్టేషన్‌కి వెళ్ళిపోయాడు.

మళ్ళీ మురళి ఎప్పటికైనా తమ యింటికి వస్తాడా? అదే ప్రశ్నగా మిగిలింది రాధకి.

---